సాక్షి
వికారాబాద్
బుధవారం । 25 । అక్టోబర్ । 2023




హస్తం, కమలం అచేతనం

నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా కొనసాగుతుండగా.. మిగిలిన పార్టీలు కొంత వెనకబడ్డాయి. 10లో▸



గంజాయి స్వాధీనం

పొలంలో గంజాయి సాగు చేసి కర్ణాటకలో విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. 10లో▸



రాగి తీగ చోరీ

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన దొంగలు.. అందులోని విలువైన రాగి తీగను చోరీ చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూం పరిశీలన



స్ట్రాంగ్ రూం పరిసరాలను పరిశీలిస్తున్న లింగ్యానాయక్ తదితరులు

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూంను ఎన్నికల రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ మంగళవారం పరిశీలించారు. నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, స్ట్రాంగ్ రూంను కళాశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఇక్కడి ఏర్పాట్లను ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం జాతీయ రహదారిపై కర్ణాటక నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల వేళ అలసత్వం తగదని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ సురేష్, ఎస్‌ఐ భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర పెంచాలి: రైతు సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న మహిమూద్

కొడంగల్ రూరల్: పత్తి పంటకు మద్దతు ధర పెంచాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ మహిమూద్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి దిగుబడి తగ్గిందని, ప్రస్తుతం నిర్ణయించిన ధర రూ. 7,200 కాకుండా రూ. 15వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఎరువులు, పురుగు మందుల ధరలు విపరీతంగా పెరిగాయని, వీటిని దృష్టిలో ఉంచుకొని మద్దతు ధర పెంచాలని కోరారు. లేకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నారాయణపేట జిల్లా సహాయ కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్, కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల మండలాల కార్యదర్శులు శ్యాంసుందర్, ముస్తఫా, మల్లప్ప, బిచ్చప్ప, అరవింద్ పాల్గొన్నారు.

నెల రోజులు శ్రమించండి

- ఐదేళ్లు సేవచేస్తా
- ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ నెల రోజులు శ్రమించి తనను గెలిపిస్తే ఐదేళ్ల పాటు ప్రజలకు సేవ చేస్తానని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం దుద్యాల మండలం గౌరారంలో సర్పంచు చాంద్‌పాషా ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని దళిత, బహుజన నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చొరవతో తాను ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో పార్టీ ఆయా మండలాల నాయకులు, దళిత సంఘాల నాయకులు ఏ శ్రీను,సాయిలు, చిన్నికృష్ణ, జీ కృష్ణ, అంజిలయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజునాయక్, నరేశ్‌గౌడ్, యాదగిరి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికే పట్టం కట్టండి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే మరోసారి పట్టం కట్టాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం వెంకట్‌రెడ్డిపల్లి, కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పట్టణంలోని శ్రీనగర్ కాలనీలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ నేతలు మాయమాటలు చెబుతున్నారని ఆరోపించారు. వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డిపల్లి నుంచి పార్టీలో చేరిన వారిలో గోవింద్ నాయక్, శేఖర్, రాజు, చాచా, నర్సింహులు, సూర్యా నాయక్, శేఖర్, మల్లేశ్, శ్రీనివాసులు, సిద్దాపూర్ గ్రామానికి చెందిన మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు నర్సింహ్మా, లింగయ్య, శివ కుమార్, నర్సింహులు ఉన్నారు



తాండూరులో పాలపిట్టలు ఎగురవేస్తున్న మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తదితరులు

నేత్రపర్వం దసరా సంబురం

జిల్లా వ్యాప్తంగా సోమవారం దసరా పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. రాత్రి రావణ దహన కార్యక్రమం నేత్ర పర్వంగా సాగింది. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

– అనంతగిరి



వికారాబాద్‌లో రావణ దహనం, హాజరైన భక్తజనం

మైండ్ గేమ్!

వినూత్న వ్యూహాలతో ముందుకు సాగుతున్న నేతలు

- ఎదుటి పార్టీలకు చెక్ పెట్టేందుకు ఎత్తుగడలు
- చేరికలను ప్రోత్సహిస్తున్న నాయకులు
- ప్రత్యర్థి పార్టీల నేతల ఇళ్లకు ముఖ్యనేతలు
- ఎదుటి వారిని ఆత్మరక్షణలో పడేసేందుకు ఎత్తులు
- ఇరు పార్టీల్లోనూ ఇదే తంతు



వికారాబాద్: ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలు, ఓటర్లను తికమక పెట్టేందుకు ముఖ్యనేతలు రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా మైండ్ గేమ్‌కు శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ ఎన్నికలకు మరో 35 రోజుల సమయం మాత్రమే ఉండటంతో నేతలు ద్వితీయ శ్రేణి నాయకులను తమ వైపు తిప్పుకోవడంతోపాటు ఎదుటి వారిని కన్‌ఫ్యూజ్ చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. ఓ వైపు పక్క పార్టీల నాయకులను తమ పార్టీలో చేర్చుకోవడం తోపాటు అవతలి పార్టీల్లో నియోజకవర్గ, మండల స్థాయి పదవుల్లో ఉన్న నాయకుల ఇళ్లకు వెళ్లి మైండ్ గేమ్‌కు తెరతీస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు జిల్లాస్థాయి నేతలు ఈ పనిలో బిజీగా ఉన్నారు. అధికార బీఆర్ఎస్‌లో ఓ ప్రజాప్రతినిధి ఈ తరహా వ్యవహారాల్లో చురుగ్గా కనిపిస్తున్నారు. పక్క పార్టీల నాయకుల ఇళ్లకు వెళ్లి కలవడం ద్వారా వారిని ఆత్మరక్షణలో పడేయడమే కాకుండా సొంత పార్టీ నేతలకు వారిపై నమ్మకం సన్నగిల్లేలా చేసి వారిపై పైచేయి సాధించే వ్యూహాలు రచిస్తున్నారు.

ప్రత్యర్థి ఇళ్లకు నాయకులు

అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ ముఖ్యనేతలు ఆడుతున్న మైండ్ గేమ్ తారాస్థాయికి చేరింది. కొంత కాలంగా వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులకు స్థానిక ఎమ్మెల్యే ఆనంద్‌కు పొసగటం లేదనే విషయం బహిరంగ రహస్యమే. చైర్‌పర్సన్ దంపతులు బీఆర్ఎస్‌ను వీడతారనే ఊహాగానాలు సైతం వినిపిస్తున్నాయి. అయితే పార్టీ వీడే విషయం వారు ప్రకటించలేదు. కాగా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి జిల్లాకు చెందిన కాంగ్రెస్ ముఖ్యనేతలు వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి మంతనాలు జరపటం హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఇది జరిగి రెండు రోజులు గడవక ముందే ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్ ముఖ్యనేతల తలుపు తట్టడం మరింత చర్చనీయాంశంగా మారింది. మున్సిపల్ మాజీ చైర్మన్ కాంగ్రెస్ వాది అయిన సత్యం సేట్ ఇంటికి ఎంపీ వెళ్లారు. గతంలో వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సైతం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడి ఇంటికి వెళ్లారు. అయితే ఈ ఘటనల్లో సత్యం సేట్, మంజులా రమేష్, సుధాకర్‌రెడ్డిలు పార్టీ మారడం గానీ, మారుతామని ప్రకటించటం గానీ జరగలేదు. దీంతో ఇది ఎదురు పార్టీ ముఖ్య నేతల మైండ్ గేమ్‌లో ఇవన్నీ భాగమేనని తేలిపోయింది.

వలసల పరంపర

ప్రధాన పార్టీల నుంచి వలసల పరంపర కొనసాగుతోంది. ఈ వలసలు అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్‌లోనే ఎక్కువగా కనిపిస్తోంది. ఇరు పార్టీలు పోటాపోటీగా వలసలను ప్రోత్సహిస్తున్నాయి. ఇందుకోసం కొన్ని గ్రూపులు పని చేస్తున్నాయి. ఈ రోజు బీఆర్ఎస్ నుంచి ఎవరైనా కాంగ్రెస్‌లో చేరారు అంటే మరుసటి రోజు ఎవరో ఒకరు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరాల్సిందే.. ఆ సమతూకం పాటించాల్సిందే అన్న తరహాలో ఇరు పార్టీల ముఖ్యనేతలు వ్యవహరిస్తున్నారు. చేరికలు ఊపందుకోవడంతో వికారాబాద్ రాజకీయం వేడెక్కుతోంది.

కాంగ్రెస్ మునిగిపోయే నావ



బీఆర్ఎస్‌లో చేరిన యువకులతో ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

- ఆ పార్టీవి వారంటీలేని గ్యారంటీలు
- ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్‌కే ఉంది
- మరోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించండి
- తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

బషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన వారంటీలేని గ్యారంటీలను నమ్మవద్దని తాండూరు ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రజలకు సూచించారు. నాయకుల కుమ్ములాటలతో ఆ పార్టీ మునిగిపోయే నావలా తయారైందని ఎద్దేవా చేశారు. మంగళవారం మండలంలోని కొర్విచెడ్‌గని, మంతటి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, యువకులు భారీగా బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూరును అభివృద్ధి చేస్తామంటూ ఓట్లు అడగడానికి వస్తున్న వలస నాయకులను నిలదీయాలని కోరారు. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు మాత్రమే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. తాండూరు గురించి అవగాహన లేని వలస నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. స్థానికుడినైన తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసే బాధ్యత కార్యకర్తలపైనే ఉందన్నారు. పార్టీకి కార్యకర్తలే వెన్నుముక అని, ఈ నలభై రోజులు సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రజల దీవెనలతో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాదనే సాధ్యం కాని హామీలు ఇస్తోందని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇన్నాళ్లు పార్టీలో పదవులు అనుభవించి ఇప్పుడు వేరే పార్టీలోకి వెళ్లిన వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వీ శ్రీనివాస్, వీ హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపే

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఖుదావన్‌పూర్, దోమ మండలంలోని పలు తండాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు నచ్చి ఎంతో మంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో రామ్మోహన్‌రెడ్డి

ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం శ్రమించాలని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

'గ్యారంటీ'లతో ప్రయోజనం

షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేశంపేట మండలం దత్తాయపల్లి సర్పంచ్ మామిడిపల్లి అలివేలు, కొత్తూరు మండలం జేపీ దర్గాకు చెందిన పలువురు మైనార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు జమృద్‌ఖాన్, శ్రావణ్‌రెడ్డి, బాలరాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలకు స్వర్గధామం

- పెట్టుబడులకు అనువైన ప్రాంతం తెలంగాణ
- టీఎస్ఐఐసీ ఎండీ వెంకట నర్సింహారెడ్డి
- కొంగరకలాన్‌లో కేన్స్ సెమికాన్ కంపెనీ ఏర్పాటుకు భూమిపూజ



కొంగరకలాన్‌లో కేన్స్ సెమికాన్ ఎలక్ట్రానిక్ పరిశ్రమకు భూమిపూజ చేస్తున్న నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: పరిశ్రమల ఏర్పాటుకు తెలంగాణ రాష్ట్రం ఎంతో అనువైన ప్రదేశమని, పెట్టుబడులకు స్వర్గధామమని టీఎస్ఐఐసీ మేనేజింగ్ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని కొంగరకలాన్ సర్వే నంబరు 300లో రూ.3 వేల కోట్లతో 46 ఎకరాల్లో కేన్స్ సెమికాన్ ఎలక్ట్రానిక్ పరిశ్రమకు మంగళవారం రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేంద్ర సింగ్ చౌహాన్‌తో కలిసి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక విధానం కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. ఇండస్ట్రియల్ పాలసీలో తొమ్మిదేళ్ల కాలంలో అనేక మార్పులు తీసువచ్చామని తెలిపారు. టీఎస్ఐపాస్ ద్వారా సింగిల్ విండో విధానంలో పరిశ్రమల ఏర్పాటుకు పదిహేను రోజుల్లో అనుమతులు ఇస్తున్న ఏకైక రాష్ట్రం మనదేనని స్పష్టంచేశారు. ప్రపంచ పెట్టుబడిదారులను ఆకర్షించేలా ఇక్కడ ప్రణాళిక రూపొందించామని వివరించారు. ముఖ్యంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. పెట్టుబడులకు అనువైన ప్రాంతం కాబట్టి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు భూమి తీసుకున్న వెంటనే విద్యుత్, నీరుతో పాటు మౌలిక సదుపాయలు కల్పిస్తోందని చెప్పారు. తైవాన్, జపాన్‌ను తలదన్నేలా పరిశ్రమలకు తెలంగాణ ల్యాండ్ మార్క్‌గా మారిందన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రజా జీవనానికి ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోందని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడానికి వీలవుతుందని చెప్పారు.

అత్యంత నివాస యోగ్యమైన ప్రాంతం

కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని తెలిపారు. భారతదేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన ప్రాంతం తెలంగాణ అని స్పష్టంచేశారు. సేఫెస్ట్ సిటీగా నగరానికి నాలుగుసార్లు గుర్తింపు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పెట్టుబడుల శాఖ సెక్రటరీ డాక్టర్ ఈ.విష్ణువర్ధన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ సెమికండక్టర్స్ డైరెక్టర్ సుజల్ కరంపూరి, కేన్స్ టెక్నాలజీ చైర్‌పర్సన్ సవితా రమేష్, శరత్‌కుమార్ భట్, ఇంటర్నేషనల్ బిజినెస్ ప్రెసిడెంట్, డాక్టర్ సమర్థ నాగభూషణం, చిత్రహరిహరన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు కసరత్తు

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- నాలుగు ఏజెన్సీల ద్వారా వడ్ల కొనుగోళ్లు
- తమ వల్ల కాదంటూ చేతులెత్తేసిన మార్కెటింగ్ శాఖ
- జిల్లాలో వరి సాగు విస్తీర్ణం 1.30 లక్షల ఎకరాలు
- 3.40 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- నవంబర్‌లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయం



వికారాబాద్: వానాకాలం వరి పంట చేతికొచ్చిన నేపథ్యంలో అధికారులు ధాన్యం కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు. వడ్లు తామే సేకరిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో అధికారులు ఇందుకోసం కసరత్తు చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది రికార్డు స్థాయిలో వరి సాగైంది. దిగుబడి అంచనా మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా 104 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగినందున కేంద్రాల సంఖ్యను పెంచాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.

మద్దతు ధర రూ. 2,203

క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం రూ. 2,203 మద్దతు ధర ప్రకటించిన విషయం తెలిసింది. అయితే తామే ధాన్యం కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో అధికారులు అందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. క్వింటాలు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2,203, బీ గ్రేడ్‌కు రూ. 2,183 చెల్లించనున్నారు. నవంబర్ నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని భావిస్తున్నారు.

120 కొనుగోలు కేంద్రాలు

యాసంగి సీజన్‌తో పోలిస్తే కొనుగోలు కేంద్రాల సంఖ్యను తగ్గించి ధాన్యం సేకరించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది 1.30 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేయగా, ఎకరానికి సగటున 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ చెబుతోంది. అయితే ఇందులో సీడ్ వరి తదితర ధాన్యం పోను కొనుగోలు కేంద్రాలకు 2.12 లక్షల మెట్రిక్ టన్నులు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. 120 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలోని 70 మిల్లర్ల ద్వారా మిల్లింగ్

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నాం. గత సీజన్‌లో తాలు తరుగు, మట్టి పెల్లలు, తేమ శాతం ఎంత ఉండాలనే విషయంలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సరైన అవగాహన లేక ఇబ్బందులు పడ్డాం. ఈ సారి వీటిపై పూర్తి అవగాహన కల్పిస్తున్నాం. రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవాలి. అప్పుడే ఎవరికీ ఇబ్బంది ఉండదు. పక్క రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేస్తాం. కోడ్ అమలులో ఉన్నందున నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తాం.

– నారాయణరెడ్డి, కలెక్టర్

క్లుప్తంగా

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



సారాతో నిందితుడిని పట్టుకున్న పోలీసులు

తాండూరు: నాటు సారాను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని తాండూరు పట్టణ ఎస్‌ఐ అబ్దుల్ రవూఫ్ వివరాలిలా ఉన్నాయి. పట్టణ శివారులోని ఖాంజాపూర్ గేట్ వద్ద ఎన్నికల సందర్భంగా పోలీస్ చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. పెద్దేముల్ మండలం నీలిగడ్డ తండాకు చెందిన ముడావత్ రాకేశ్ చెక్ పోస్ట్ సమీపంలో ప్లాస్టిక్ బాటిల్‌లు కలిగిన సంచితో అనుమానాస్పదంగా వెళ్తున్నాడు. చెక్ పోస్ట్‌లో ఉన్న పోలీసులు అనుమానించి రాకేశ్‌ను పిలిచి విచారించారు. సంచిలో ఉన్న బాటిళ్లను చూపించమని అడగటంతో భయపడ్డాడు. దీంతో పోలీసులు సంచిని తీసుకొని చెక్ చేశారు. అందులో ఉన్న 30 బాటిళ్లలో 30 లీటర్ల నాటు సారా ఉన్నట్లు గుర్తించారు. వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

తోపులాటలో కిందపడి వ్యక్తి మృతి!

ఇబ్రహీంపట్నం: వారి మధ్య ఎలాంటి పరిచయం లేదు. కాని తాగిన మైకంలో జరిగిన చిన్న తగాదా వలన ఓ నిండు ప్రాణం బలైపోయింది. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం మంచాల రోడ్డులో సోమవారం రాత్రి చోటుచేసుకోగా.. మంగళవారం వెలుగుచూసింది. ఎస్‌ఐ మైబెల్లి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన ఎండీ బాబా(31) మూడు నెలల క్రితం ఇబ్రహీంపట్నంకు వచ్చి సెంట్రింగ్ పనులు చేస్తుండేవాడు. బంధువులైన కందుకూర్ గ్రామానికి చెందిన మల్లేశ్, జనగాంకు చెందిన లక్ష్మణ్‌లు ప్లాస్టిక్ కవర్లు, సీసాలు తదితర వాటిని సేకరించి జీవనం సాగిస్తున్నారు. వారు తాగిన మైకంలో బాబా తగలడంతో వారి మధ్య గొడవ జరిగింది. మల్లేశ్, లక్ష్మణ్‌లు బాబాను నెట్టివేయడంతో కిందపడ్డాడు. అనంతరం వారి ఇద్దరు అక్కడి నుంచి వెళ్లిపోయారు. మంగళవారం ఉదయం ఓ వ్యక్తి రోడ్డుపై పడి ఉన్నాడన్న సమాచారంతో.. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా.. బాబా అప్పటికే మృతి చెందాడు. అనంతరం సీసీ పుటేజీలను పరిశీలించి నిందితులిద్దరినీ మంగళవారం ఉదయం పట్టుకున్నారు. కాగా మృతదేహంపై ఎలాంటి గాయాలు లేవని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి పంపినట్లు పోలీసులు తెలిపారు. తోసేయడంతో కిందపడి ప్రాణాలు కోల్పోయాడా? మరేదైనా కారణం ఉందా అనేది పోస్టుమార్టం ఆధారంగా తెలుస్తుందన్నారు.

కట్టమైసమ్మ ఆలయంలో చండీయాగం



ఆలయంలో చండీయాగం నిర్వహిస్తున్న భక్తులు

మొయినాబాద్: మండలంలోని సురంగల్ కట్ట మైసమ్మ ఆలయంలో మంగళవారం చండీయాగం నిర్వహించారు. ఆరునెలల క్రితం ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. ఈ సందర్భంగా పుణ్యావాహచనం, మండపారాధన, చండీయాగం పూజలు చేశారు. చండీయాగంలో ఆదాయ పన్ను శాఖ మాజీ అధికారి రాములు, సర్పంచ్ గడ్డం లావణ్య, మాజీ సర్పంచ్ లావణ్య, మాజీ ఉపసర్పంచ్ యాలాల జైపాల్‌రెడ్డి దంపతులు, మాజీ వార్డు సభ్యుడు మహేందర్‌రెడ్డి దంపతులు, వ్యాపారవేత్త విజయభాస్కర్‌రెడ్డి దంపతులు, నర్సింహారెడ్డి దంపతులు హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, భాస్కరాచారి, జైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎట్టయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం భ్రష్టు పట్టింది

- నిద్రావస్థలో ఎమ్మెల్యే జైపాల్ యాదవ్
- అభివృద్ధికి నోచుకోని కల్వకుర్తి
- కాంగ్రెస్‌ను ఆదరించండి.. అభివృద్ధిని ఆస్వాదించండి
- ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ కసిరెడ్డి తదితరులు

తలకొండపల్లి: నిద్రావస్థలో ఉన్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కల్వకుర్తి నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని, ఈ ప్రాంతంలో విద్యారంగం భ్రష్టు పట్టిందని కాంగ్రెస్ పార్టీ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల పరిధి ఖానాపూర్‌లో వివిధ పార్టీలకు సంబంధించిన నాయకులు ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరగా.. వారికి ఎమ్మెల్సీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతం ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక సీట్లు గెలుపొంది రాష్ట్రంలో అధికారం చేపట్టబోతుందని జోస్యం చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని, అధ్వానంగా మారిన రహదారులకు మరమ్మతు చేపట్టి అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ఇంకా నాల్గున్నర ఏళ్లు ఎమ్మెల్సీ పదవి ఉన్నా.. వదులుకొని, కల్వకుర్తి అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్‌లో చేరానని, చెయ్యి గుర్తుకు ఓటు వేసి గెలుపించాలని కోరారు. ఇందులో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ప్రదీపురెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి, మధు, చంద్రశేఖర్, లక్ష్మీకాంత్, సంజీవరెడ్డి, రాఘవేంద్రారెడ్డి, ఎండీ బాబా, పాండుగౌడ్, సురేష్, శ్రీశైలం, నరేష్, మాధవరెడ్డి, గిరి, శివ, రాజు, సాయిలు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి రండి

టీడీపీ నేతకు మాజీ మంత్రి ఆహ్వానం

మర్పల్లి: టీడీపీ చెవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుభాష్‌యాదవ్ త్వరలోనే కాంగ్రెస్‌లో చేరుతారని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన మండల కేంద్రంలోని సుభాష్‌యాదవ్ ఇంటికి వెళ్లి పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. త్వరలోనే రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ మారేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సైతం సుభాష్‌కు ఫోన్‌చేసి తమవెంట కలిసి రావాలని కోరారు. అంతకు ముందు మండల పరిధిలోని కుడుగుంట గ్రామానికి చెందిన పలువురు మహిళలు, నాయకులు ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము అధికారంలోకి రాగానే ఆరు నెలల్లోపు కుడుగుంటను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.



కాంగ్రెస్ చేరిన కుడుగుంట మహిళలతో ప్రసాద్‌కుమార్

గంజాయి స్వాధీనం

నిందితుడి అరెస్ట్, రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ (చిత్రంలో గంజాయి, విత్తనాలు, ముసుగులో నిందితుడు)

ధారూరు: వ్యవసాయ పొలంలో గంజాయి సాగు చేసి కర్ణాటక రాష్ట్రంలో విక్రయిస్తున్న ఓ వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ జిల్లా ఇన్‌చార్జ్ ప్రశాంత్‌వర్ధన్, కోట్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ధారూరు సీఐ రామకృష్ణ మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కోట్‌పల్లి మండలం మోత్కుపల్లికి చెందిన పాండురంగారెడ్డి(53) గత కొంత కాలంగా తన పొలంలో గంజాయి సాగు చేస్తున్నాడు. దీన్ని కర్ణాటక రాష్ట్రంలోని కుంచారం, సమీప గ్రామాల్లో విక్రయిస్తున్నాడు. ఇటీవల పొలం నుంచి సేకరించిన గంజాయి, గంజాయి విత్తనాలను ఇంట్లో దాచిపెట్టాడు. విశ్వసనీయ సమాచారం మేరకు కోట్‌పల్లి ఎస్‌ఐ స్రవంతి, పోలీసులతో కలిసి నిందితుడి ఇంట్లో సోదా చేయగా.. 10 కిలోల గంజాయి, 860 గ్రాముల గంజాయి విత్తనాలు లభ్యమయ్యాయి. దీంతో అతన్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపర్చగా నిందితుడికి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. గంజాయి లాంటి మత్తు పదార్థాలను ఇతరులకు సరఫరా చేసి విక్రయించిన, ఓటర్లకు ప్రలోభపెట్టేందుకు మత్తు పదార్థాలు, డబ్బులు పంపిణీ చేస్తూ పట్టుబడిన నిందితులపై కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

హస్తం, కమలం అచేతనం

- ఖరారు కాని కాంగ్రెస్ అభ్యర్థి
- బయటకు రాని కాషాయ దళం
- ప్రచారంలో దూసుకుపోతున్న అధికార పార్టీ



ఇబ్రహీంపట్నం నియోజకవర్గ మ్యాప్

ఇబ్రహీంపట్నం: నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రచారం జోరుగా కొనసాగుతుండగా.. మిగిలిన ప్రధాన పార్టీలు కొంత వెనకబడ్డాయి. అధికార పార్టీ అభ్యర్థులను ముందుగానే ప్రకటించడంతో స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఇప్పటికే పలు గ్రామాలను చుట్టేశారు. మండల కేంద్రాలు, మున్సిపాలిటీల్లో పార్టీ క్యాడర్, బూత్ స్థాయి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించి, వారిని కార్యోన్ముఖులను చేశారు. దీంతో గులాబీ శ్రేణులు సైతం ప్రచార పర్వంలోకి దిగాయి. అటు ప్రభుత్వం ఇటు ఎమ్మెల్యేగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ముందుకెళ్తున్నారు.

ఊపందుకోని రాజకీయ వేడి

నియోజకవర్గంలో రాజకీయ వేడి ఇంకా ఊపందుకోలేదు. బీజేపీ తమ అభ్యర్థిగా నోముల దయానంద్‌గౌడ్‌ను ప్రకటించింది. పార్టీ క్యాడర్‌ను సమన్వయం చేసుకొని ఆయన ప్రచారం రంగంలోకి దిగేందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఇక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరో ఇప్పటికీ తేలలేదు. ఈ టికెట్‌కు తీవ్ర స్థాయిలో పోటీ నెలకొంది. హస్తం నేతలు మల్‌రెడ్డి రంగారెడ్డి, మర్రి నిరంజన్‌రెడ్డి, దండెం రాంరెడ్డి టికెట్ తమకే వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. బీసీ కోటా నుంచి తనకే అవకాశం దక్కుతుందని శేఖర్‌గౌడ్ ధీమా వ్యక్తంచేస్తున్నారు.

పొత్తుల కలవరం

కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తుల నేపథ్యంలో పట్నం సీటు అంశం ఆయా పార్టీల ఆశావహులను కలవరానికి గురిచేస్తోంది. పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని తమకే కేటాయించాలని కమ్యూనిస్టులు పట్టుబడుతున్నట్లు సమాచారం. సీపీఎం, బీజేపీతో పోలిస్తే ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు మంచి పట్టుంది. బీఆర్ఎస్‌తో పోటీని తట్టుకోవాలంటే ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి కీలకంగా మారే అవకాశం ఉంది. కానీ టికెట్ ఎవరికీ కేటాయించకపోవడంతో ఉత్కంఠ కొనసాగుతోంది.

'బూర' ఆశలు గల్లంతు

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ గతేడాది బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరారు. ఇబ్రహీంపట్నం సీటుపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. పార్టీశ్రేణులతో ఆత్మీయ సమ్మేళనాలు సైతం నిర్వహించారు. సీటు ఆయనకే వస్తుందని చివరి నిమిషం వరకూ ప్రచారం సాగింది. కానీ దయానంద్‌గౌడ్‌ను పార్టీ అభ్యర్థిగా ప్రకటించడంతో బూర ఆశలు గల్లంతయ్యాయి.

'కొత్త'కు దక్కని సెకండ్ చాన్స్

2018 ఎన్నికల్లో బీజేపీ తరఫున కొత్త అశోక్‌గౌడ్ పోటీ చేశారు. ఈసారి కూడా తనకే అవకాశం కల్పించాలని ఆయన అధిష్టానానికి విన్నవించారు. అతనితోపాటు బీజేపీ నాయకుడు పోరెడ్డి అర్జున్ రెడ్డి, మర్పల్లి అంజయ్యయాదవ్ కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేసినా ఫలించలేదు.

ఆగిన వంతెన నిర్మాణం



తాత్కాలికంగా వేస్తున్న రోడ్డు

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- ప్రజల సహకారంతో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

షాబాద్: షాబాద్–చర్లగూడ గ్రామాల మధ్య వంతెన నిర్మాణం పనులు ఆగిపోయాయి. దీంతో ప్రయాణాలు సాగించేందుకు తాత్కాలికంగా రోడ్డును నిర్మించారు. అయితే ఇటీవల వర్షాలకు ఆ రోడ్డు కూడా కొట్టుకుపోవడంతో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో చర్లగూడెం గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రులు ఎంతో ఆర్భాటంగా నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసినప్పటికీ.. కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించి మధ్యలోనే వదిలివేయడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు వేయాలని గ్రామస్తులు సర్పంచ్‌కు మొరపెట్టుకోగా ఆయన సానుకూలంగా స్పందించి తాత్కాలికంగా రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



ఆంజనేయులు(ఫైల్)

కొందుర్గు: మనస్తాపానికి గురై ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొందుర్గు మండలం తంగెళ్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చాకలి ఆంజనేయులు(40) భార్య లక్ష్మి రెండేళ్ల క్రితం మరణించింది. వీరికి జగదీశ్వర్, రాజశేఖర్ ఇద్దరు కుమారులు. జగదీశ్వర్ ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. రాజశేఖర్ 9వ తరగతి చదువుతున్నాడు. అయితే సోమవారం ఉదయం జగదీశ్వర్ డ్యూటీకి వెళ్తుండగా పండుగపూట డ్యూటీకి వెళ్లొద్దని వారించాడు. వెళ్లకుంటే పనిలో నుంచి తీసివేస్తారని జగదీశ్వర్ తండ్రి మాటలు వినకుండా వెళ్లపోయాడు. దీంతో పండుగరోజు ఇంట్లో ఎవరూ లేరని మనస్థాపానికి గురైన ఆంజనేయులు.. చెర్కుపల్లి గ్రామశివారులోని పిచ్చకుంట్ల లక్ష్మి వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు మృతుడి కుమారుడికి సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే ఆంజనేయులు మృతిచెందాడు. మృతుడి కుమారుడు జగదీశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

పండుగ పూట విషాదం

- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టిన బైక్
- అక్కడికక్కడే యువకుడి మృతి



భరత్‌కుమార్ (ఫైల్)

కేశంపేట: పండుగ పూట కుటుంబంలో విషాదం నిండింది. దసరా సందర్భంగా బంధువులను కలిసేందుకు హుషారుగా ఇంటి నుంచి బయలుదేరిన విద్యార్థి మార్గమధ్యలోనే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కొత్తపేట గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేశ్వరం మండలంలోని కోళ్ల పడకల్‌కు చెందిన పాలాది భరత్‌కుమార్ (22) అమ్మమ్మ గారి ఊరైన కేశంపేటకు బైక్‌పై బయలుదేరాడు. అక్కడ అందరికీ శుభాకాంక్షలు చెప్పాడు. అనంతరం అక్కను కలిసేందుకు బైర్కాన్‌పల్లికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో కొత్తపేట శివారు వద్ద రోడ్డు పక్కన్న నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో భరత్‌కుమార్ మృతి చెందాడు. మృతుడి బంధువు పాలాది జగన్‌మోహన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపారు.

'కంది' తెచ్చిన తంట

చేవెళ్ల: ఇంటి ముందు పెంచుకున్న కంది మొక్కలు విరిగాయని దాయాదుల మధ్య జరిగిన గొడవ పోలీస్‌స్టేషన్‌కు దారి తీసింది. ఈ సంఘటన చేవెళ్ల ఠాణా పరిధి మీర్జాగూడ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మీర్జాగూడలో కావలి శివ తన ఇంటి పక్కన కందిమొక్కలను పెంచుకున్నాడు. ఆదివారం ఆ మొక్కలు విరిగిపోయి కనిపించాయి. అది ఎవరు విరిచారో తెలియదని, కాని ఇంటిపక్కనే ఉండే దాయాది శంకరయ్య కుటుంబ సభ్యులపైనే అనుమానం వ్యక్తం చేయడంతో పాటు.. దుర్భాషలాడాడు. దీంతో శంకరయ్య కుటుంబీకులు తమను ఎందుకు తిడుతున్నావని ప్రశ్నించారు. దీంతో ఇరువురు మధ్య మాటమాట పెరిగి ఇరు కుటుంబాల మధ్య గొండవకు దారితీసింది. మహిళ అని చూడకుండా తోసేశాడని శంకరయ్య భార్య పోలీసులకు శివపై ఫిర్యాదు చేసింది. దీంతో ఇరువురు ఠాణాలో ఫిర్యాదు చేసుకున్నారు. దీంతో పోలీసులు ఇరువురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని..

కేశంపేట: కుటుంబ తగాదాలతో మూడేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిన భార్య కాపురానికి రావడం లేదనే స్థాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి వేములనర్వ గ్రామంలో రావిచెట్టి శ్రీను(38) కూలీపనులు చేస్తూ జీవించేవాడు. భార్య పుట్టింటికి వెళ్లి ఎంతకీ తిరిగిరావడం లేదనే బాధతో ఉరి వేసుకొని అత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి అన్న జంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పాండయ్య తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

కొత్తూరు: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన మండల పరిధి తీగాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. గ్రామ సమీప చెరువులో ఓ మహిళ మృతదేహం ఉన్నట్లు సురేష్ అనే వ్యక్తి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలికి చేరుకున్నారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతురాలి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్ల ఉంటుందని తెలిపారు. ఆమె పసుపు రంగు జాకెట్, ఆకుపచ్చ, నలుపు రంగు చీర ధరించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వాహనదారులూ.. జర భద్రం

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి సాగర్ రహదారి నుంచి కమ్మగూడ బాలయేసు చర్చికి వెళ్లే రోడ్డుపై పోచమ్మ దేవాలయం సమీపంలో రోడ్డుపైన పెద్ద గోతి ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం వాహనాల రద్దీతో ఉండే ఈ రోడ్డులో గోతి ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నా రు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి గుంతను పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

అమ్మా దీవించు..

షాద్‌నగర్: అమ్మా దీవించు అని విజయదశమి రోజున కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్‌లో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సెంటిమెంట్‌ను నమ్ముకున్న శంకర్.. తన తల్లి అంజమ్మ కాళ్లు మొక్కి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. విజయీభవ అంటూ తల్లి కొడుకును ఆశీర్వదించారు. అనంతరం చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో ప్రచార రథాలకు ప్రత్యేక పూజలు చేశారు. కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ గ్రామం నుంచి ఆయన ప్రచారం ప్రారంభించారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో ఎదగాలి



అలాయ్ బలాయ్ చేసుకుంటున్న నాయకులు

- సంఘం మండల అధ్యక్షుడు లింగం

షాబాద్: ముదిరాజ్‌లు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు లింగం ఆకాంక్షించారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో సంఘం నాయకులతో కలిసి అలాయ్ బలాయ్ కార్యక్రమాన్ని నిర్వహించి, దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మాసయ్య, జంగయ్య, వెంకటయ్య, బాల్‌రాజ్, జనార్దన్, రాజు, సుభాశ్, నర్సింహులు, గౌరీశ్వర్, సుధాకర్, సత్యనారాయణ, వెంకటయ్య తదితరులున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న బీచ్యానాయక్

కడ్తాల్: మండల కేంద్రంలోని ఎస్ఎల్ఆర్ గార్డెన్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. సమావేశానికి సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్ హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ ప్రచార కార్యాచరణ గురించి చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, అనుబంధ సంఘాల కాంగ్రెస్ నాయకులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, హీరాసింగ్, రాజేశ్, రవి, తులసీరాం పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి రాగి తీగ చోరీ

కందుకూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను కూలదోసిన దొంగలు.. అందులోని విలువైన రాగి తీగను చోరీ చేశారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధి పులిమామిడి గ్రామ సమీపాన మల్లేశ్‌కు చెందిన వ్యవసాయ పొలంలో ఒకటి, దాని పక్కనే గ్రామ పంచాయతీకి సంబంధించిన మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూలదోసి అందులోంచి విలువైన రాగి తీగను దొంగిలించారు. మంగళవారం ఉదయం గమనించిన రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్